
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
నంద్యాల
జిల్లా వార్తలు 5
సోమవారం 17 ఫిబ్రవరి 2025



ఆ పనులు పూర్తికావా?



మహానందిలో అర్ధాంతరంగా నిలిచి అసంపూర్తిగా ఉన్న ల్యాండ్ స్కేపింగ్ నిర్మాణ పనులు

మహానంది క్షేత్రం అభివృద్ధి కోసం గత ప్రభుత్వ హయంలో రెండేళ్ల కింద ఆ నియోజక వర్గానికి చెందిన ఒక వైసీపీ నేత తన సొంత డబ్బులు రూ. 2 కోట్లతో ల్యాండ్ స్కేపింగ్ పనులను ప్రారంభించారు. ఆలయం ముందు భాగంలోని రాతి నంది విగ్రహం చుట్టూ, ఆలయ మాడవీధుల్లో ల్యాండ్ స్కేపింగ్ పనులు చేపట్టి భక్తులకు ఆహ్లాదకర వాతావరణం కల్పించడం ఆ నాయకుడి లక్ష్యం. ఇందులో భాగంగానే రాతినంది చుట్టూ వాటర్ ఫౌంటెన్, రంగు రంగుల విద్యుత్ బల్బులను ఏర్పాటు చేసి, పచ్చదనం ఉండేలా అభివృద్ధి చేశారు. ఈ ఏర్పాటు భక్తులను ఆకట్టుకోనేది. అక్కడ నిలబడి ఫొటోలు తీసుకొనేందుకు భక్తులు ఆసక్తి చూపేవారు. అయితే పర్యవేక్షణ లేకపోవడంతో ఈ పరిసరాలు దెబ్బతిన్నాయి. ఈలోగా వైసీపీ అధికారం కోల్పోవడంతో ఆలయం చుట్టూ ల్యాండ్ స్కేపింగ్ పనులు పూర్తి చేయడంపట్ల సదరు నాయకుడు ఆసక్తి చూపలేదు. దీంతో పనులు ఆగిపోయాయి. ఆ పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. భక్తుల నుంచి విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

- మహానందిలో అటకెక్కిన ల్యాండ్ స్కేపింగ్ పనులు
- అర్ధాంతరంగా నిలిచిపోవడంతో ఆలయ వీధుల్లో అపరిశుభ్రత
- రంగులకు కూడా నోచుకోని ఇనుప గ్రిల్స్
- పట్టించుకోని దేవదాయశాఖ అధికారులు
- ఈ ఏడాది కూడా శివయ్య నిశ్చితార్థం షామియానా కిందేనా?
- 10 నెలలుగా ముందుకు సాగని పనులు

మహానంది, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): దక్షిణ భారత దేశంలోనే శ్రీశైలం తర్వాత అంతటి పేరుగాంచిన మహానంది క్షేత్రానికి నిత్యం వేలాది మంది భక్తులు తెలుగు రాష్ట్రాల నుండే కాక ఇతర రాష్ట్రాల నుండి వస్తుంటారు. ఈ మేరకు క్షేత్ర పరిసరాలను తీర్చి దిద్దాలని గత వైసీపీ హయంలో ఆ పార్టీ నియోజకవర్గ ప్రజా ప్రతినిధి భావించారు. సొంత డబ్బులు రూ. 2 కోట్లతో ఆలయం చుట్టూ ల్యాండ్ స్కేపింగ్ పనులు చేపట్టారు. దీని కోసం హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఆర్కిటెక్ నిపుణులతో ప్లాన్ సిద్ధం చేయించారు. పనులు సవ్యంగా జరిగేలా పర్యవేక్షించేవారు. మండలంలోని తమ పార్టీ నేతలతో చర్చించేవారు. అయితే కార్మికుల కొరత వల్ల పనుల్లో జాప్యం జరిగింది. రాతి నంది చుట్టూ పనులు మాత్రమే జరిగినా.. దాని ఆలనా పాలనకు సరియైన సిబ్బంది లేక పోవడంతో పూర్తయిన ఫౌంటెన్ కూడ నిరూపయోగంగా మారింది. ఈ 10 నెలల్లో ఆలయం చుట్టూ ఏర్పాటు చేసిన ఇనుప గ్రిల్స్ తుప్పు పట్టాయి. నిలిచిన ల్యాండ్ స్కేపింగ్ పనులను పూర్తి చేసేందుకు దేవదాయశాఖ పూనుకోవడానికి నిబంధనలు అడ్డు తగలడంతో పూర్తి చెయ్యలేక పోతున్నామని అధికారులు నిస్సహాయత వ్యక్తం చేసారు. ఈనెల 22 నుండి పది రోజుల పాటు జరిగే మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు అసంపూర్తిగా నిలిచిన ల్యాండ్ స్కేపింగ్ పనులను దాత పట్టించుకొని కనీసం రంగులు వేయించినా పరిసరాలకు కొత్త కళ వచ్చేదని భక్తులు అంటున్నారు.

ఈ ఏడాది మహానందీశ్వరుడి వేడుకలు షామియానా కిందేనా?

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించే కల్యాణం కార్యక్రమంలో భాగమైన స్వామివారి నిశ్చితార్థం గత ఏడాది మాదిరే ఈ ఏడాది కూడ షామియానా కిందనే జరపడానికి సిద్ధమవుతున్నారు. ల్యాండ్ స్కేపింగ్ పనుల్లో భాగంగా ఆలయం పరిసరాల్లోని రాతి నిశ్చితార్థ మంటపాన్ని రెండేళ్ల కింద ఆలయ అధికారులు హడావిడిగా పడకొట్టారు. ఆనవాయితీ ప్రకారం కల్యాణానికి పెళ్ళి పెద్దలుగా వ్యవహరించే దాతలు ముందుకు వచ్చి నిశ్చితార్థ మంటపాన్ని తిరిగి నిర్మించాలని ఆలయ అధికారులు కోరారు. దీనికి దాతలు ముందుకు వచ్చారు. కంచి కామకోటి పీఠాధిపతి చేత భూమి పూజ చేయించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక స్థానిక శాసన సభ్యుడు బుడ్డా రాజశేఖర్‌రెడ్డి చేత మరోసారి రాతి నిశ్చితార్థ మంటపం నిర్మాణానికి భూమి పూజ చేయించినా.. నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. ఇలా రెండుసార్లు అట్టహాసంగా భూమి పూజ కార్యక్రమం చేపట్టినా ఫలితం కనిపించలేదు. దీంతో ఈ ఏడాది శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా జరిగే స్వామి, అమ్మవార్ల నిశ్చితార్థ కార్యక్రమం షామియాన కింద పూర్తి చేసేందుకు ఆలయ అధికారులు ఏర్పాటు చేస్తున్నారు.



మహానందిలో రంగులకు నోచుకోని ఇనుప గ్రిల్స్

దాత చేపట్టిన పనుల్లో జోక్యం చేసుకోలేం

మహానందిలో ల్యాండ్ స్కేపింగ్ పనులను దాత చేపట్టడం వల్ల.. ఆగిపోయిన పనుల్లో మేం జోక్యం చేసుకోవడం లేదు. దీంతో ఆలయం మాడవీధుల్లో ఏర్పాటు చేసిన ఇనుప గ్రిల్స్‌కు రంగులు వెయ్యడానికి పూనుకోలేదు. దేవదాయశాఖ నిబంధనల ప్రకారం అభివృద్ధి పనులను చేసే దాతల చేతనే పూర్తి చెయ్యించాల్సి ఉంటుంది. ఒక వేళ దాత మిగిలిన పనులను చేయించేందుకు ఆసక్తి చూపలేక పోతున్నానని లిఖిత పూర్వకంగా తెలిపితే, దేవదాయశాఖ కమిషనర్ అనుమతి తీసుకొని మిగిలిన ల్యాండ్ స్కేపింగ్ పనులు పూర్తి చేసే అవకాశం ఉంది.


- నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, ఆలయ ఈవో



నిరూపయోగంగా ఉన్న రాతి నంది పరిసరాలు

యువకుడి వైద్యానికి మంత్రి లోకేశ్ భరోసా

సోషల్ మీడియాలో పోస్టుకు స్పందన



సోషల్ మీడియాలో పోస్టుకు స్పందించిన మంత్రి లోకేశ్

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): యువకుడి వైద్యానికి మంత్రి నారా లోకేశ్ భరోసా కల్పించారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' ద్వారా టీడీపీ నాయకులు, కార్యకర్తలు విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మంత్రి స్పందిస్తూ ఆదుకుంటామని హామీ ఇచ్చారు. వివరాలివీ.. కర్నూలు నగరంలోని గడ్డ స్ట్రీట్‌కు చెందిన పి.నవాస్ ఖాన్ గత కొంతకాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. వైద్యం కోసం హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిని సంప్రదించగా అతడి కిడ్నీ పాడైపోయిందని వైద్యులు నిర్ధారించారు. దీంతో యువడికి తన కిడ్నీ ఇవ్వడానికి తండ్రి సిద్ధమయ్యారు. అయితే ఈ చికిత్సకు రూ.13 లక్షలు, అనంతరం ఆరు నెలల పాటు ఇంజెక్షన్లు, మందులు, తదితర వాటికి మరో రూ.12 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు చెప్పారు. ఆర్థిక స్థోమత లేకపోవడంతో కాలనీకి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఎక్స్(ట్విట్టర్) ద్వారా కాలనీకి చెందిన ఓ టీడీపీ కార్యకర్త అకౌంట్ నుంచి శనివారం మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లగా.. ఆదివారం మంత్రి స్పందిస్తూ ప్రభుత్వం తరపున సాధ్యమైనంత వరకు సాయం చేస్తామని భరోసా ఇచ్చారు. లోకేశ్ కార్యాలయం నుంచి ఆదివారం నవాస్ ఖాన్‌కు ఫోన్ చేశారు. ప్రభుత్వం నుంచి రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు ఆర్థిక సహకారం అందిస్తుందని, వివరాలను పంపాలని కోరారు. దీంతో మంత్రి లోకేశ్‌కు నవాస్ ఖాన్ కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది.

గడివేములలో 70 కోళ్లు మృతి

గడివేముల, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఓ చికెన్ దుకాణంలో ఆదివారం ఉదయం సుమారు 70 కోళ్లు మృత్యువాత పడ్డాయి. దీంతో నిర్వాహకులు మృతి చెందిన కోళ్లను గ్రామానికి దూరంగా పారేశారు. ఇవి వైరస్‌తో మృత్యువాత పడ్డాయా?, ఇతర కారణాలతో మృత్యువాత పడ్డాయో? తెలియాల్సి ఉంది. 70 కోళ్లు మృతి చెందాయన్న వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడంతో చికెన్ ప్రియులు చికెన్‌ను తినడానికి భయపడుతున్నారు. దీంతో వ్యాపారాలు భారీగా తగ్గాయని చికెన్‌షాపు నిర్వాహకులు తెలిపారు. మరి కొందరు చికెన్‌షాపు నిర్వాహకులు ఆదివారం చికెన్ షాపులు మూసి వేశారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక



నంద్యాల నూనెపల్లె, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): నంద్యాలలోని కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నుంచి ప్రజల విజ్ఞప్తులు స్వీకరిస్తామని కలెక్టర్ రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 9:30 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందని, జిల్లాలోని అన్ని శాఖల జిల్లా అధికారులు కార్యక్రమానికి హాజరు కావాలని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంతోపాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.

ముగిసిన కేఎంసీ వార్షిక సమావేశం

హాజరైన పూర్వ విద్యార్థులు



గురువులతో పూర్వ విద్యార్థులు

కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): రెండు రోజులు పాటు నిర్వహించిన కర్నూలు మెడికల్ కాలేజీలో పూర్వ విద్యార్థుల వార్షిక సమావేశం ఆదివారం ముగిసింది. దాదాపు 800 మంది వైద్యులు అమెరికా, ఇతర దేశాల నుంచి హాజరయ్యారు. మొదటి రోజున కేఎంసీలో చదువుకున్న రాజకీయ రంగాల్లో స్థిరపడిన వైద్యులు పాల్గొనగా, రెండో రోజు వైద్య విజ్ఞాన సదస్సులో 20 నుంచి 25 సూపర్ స్పెషాలిటీ అంశాలపై ఉపన్యసించారు. ప్రముఖ వైద్య నిపుణులు డా.మల్లికార్జున, డా.గోఖలే, డా.సదాశివరెడ్డి, డా.గణేష్, డా.సంపత్, డా.ప్రసాద్‌బాబు, డా.చందనారెడ్డి, ప్రొస్టేట్ క్యాన్సర్, హార్ట్ సర్జరీ, రోబెటిక్ సర్జరీ, ఫిట్స్, రక్తహీనత అంశాలపై సదస్సులో వివరించారు. అనంతరం సాయంత్రం కర్నూలు మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థుల సంఘం సర్వసభ్య నిర్మాణాన్ని చేపట్టాలని తీర్మానం చేశారు. అనంతరం గురువులు డా.డీవీ సుబ్బారెడ్డి, డా.రాఘవరెడ్డి, డా.రామిరెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ ఛైర్మన్ డా.కుమారస్వామిరెడ్డి, సెక్రటరీ డా.బాలమద్దయ్య, కోశాధికారి డా.మహేశ్వరరెడ్డి, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్మన్ డా.కేజీ గోవిందరెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా గణపతి హోమం

శ్రీశైలం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): లోకకళ్యాణార్థం శ్రీశైల దేవస్థానం వారు సాక్షిగణపతి ఆలయంలో నిర్వహించిన గణపతి హోమం ఆదివారం పూర్ణాహుతితో ముగిసింది. సంకష్టహర చతుర్థిని పురస్కరించుకొని సాక్షిగణపతి ఆలయంలో ప్రత్యేక అభిషేకం, పుష్పార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైదిక సంప్రదాయంలో భాగంగా ఆలయ వేదపండితులు, అర్చకులు గణపతి హోమం నిర్వహించారు. అనంతరం యాగ సమిధలను అగ్నికి ఆహుతి చేశారు. ఆదివారం జరిగిన ప్రతేక పూజల్లో మల్లికార్జున స్వామి వారి ఆలయ ప్రధాన అర్చకులు హెచ్.వీరయ్య, అర్చకులు ఉమానాగేశ్వర శాస్త్రి, వేదపండితులు గంట్ి రాధాకృష్ణ శర్మ, అధికారులు పాల్గొన్నారు.



గణపతి హోమం నిర్వహిస్తున్న అర్చకులు

రైతు బజార్లలో సబ్జి కూలర్లు

- కూరగాయలు పాడవకుండా ముందు జాగ్రత్తలు
- గుంటూరు, చిత్తూరులో పైలట్ ప్రాజెక్టుగా అమలు
- త్వరలోనే కర్నూలు జిల్లాలో



కర్నూలు అగ్రికల్చర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రానున్న వేసవిలో కూరగాయలను విక్రయించాలంటే రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోక తప్పదు. నాణ్యత లేని కూరగాయలు కొనడానికి వినియోగదారులు ఇష్టపడరు. ఈ పరిస్థితులను ముందుగానే గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం కూరగాయలు ఎక్కువ కాలం మన్నిక ఉండేలా సబ్జి కూలర్లు రైతుబజార్లలో ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా గుంటూరు, చిత్తూరు జిల్లాలో రైతుబజార్ల వద్ద సబ్జి కూలర్లు ఏర్పాటు చేసి వచ్చే నెలల్లోనే రాష్ట్రంలో ఉన్న మిగతా రైతుబజార్లలో సబ్జి కూలర్లు ఏర్పాటు చేయడానికి చర్యలు చేపడుతున్నట్లు కర్నూలు మార్కెటింగ్ శాఖ ఏడీఎం నారాయణమూర్తి, నంద్యాల ఏడీఎం రెహిమాన్ సోమవారం తెలిపారు. పండ్లు, కూరగాయలు, పూలు, నిల్వ చేయడంతో పాటు అవి సహజంగా పక్వానికి రావడానికి ఈ సబ్జి కూలర్లు ఎంతగానో ఉపయోగపడుతాయని ఏడీఎం నారాయణమూర్తి తెలిపారు. పండ్లు, కూరగాయల్లో పోషక విలువలు ఎక్కువ కాలం మన్నికగా ఉండటానికి, త్వరగా పాడైపోయే టమోటా, దోస, క్యాప్సికం వంటి కూరగాయలు, ఆకుకూరలు 3 నుంచి 5 రోజులు నిల్వ చేయడానికి ఈ కూలర్లు ఉపయోగపడతాయని తెలిపారు. వెంటనే పాడవ్వని క్యారెట్, బీట్రూట్, ముల్లంగి వంటివి వారం పాటు నిల్వ చేసుకోవచ్చు అన్నారు. అధికారులు తెలిపిన వివరాల మేరకు ఒక్కో సబ్జి కూలర్ విలువ రూ.27 లక్షలు ఉంటుంది. ఈ కూలర్లకు అయ్యే ఖర్చులో 50 శాతం ఉద్యానశాఖ సబ్సిడీ ఇస్తుందని మిగిలిన 50 శాతం స్టాల్స్ నిర్వాహకులైన స్వయం సహాయక బృందాల సభ్యులు, రైతు ఉత్పత్తిదారుల బృందాలు, రైతు సహకార సంఘాలు భరించాల్సి ఉంటుంది. ముంబై, ఐఐటీ నిపుణులు తయారు చేసిన ఈ సబ్జి కూలర్లలో మహారాష్ట్రలోని రుకార్డు టెక్నాలజీ సంస్థ 100, 50, 25 కిలోల సామర్థ్యంగల కూలర్లను వివిధ ప్రాంతాలకు సరఫరా చేస్తోంది. గుంటూరు చుట్టగుంట రైతుబజారులో 100 కిలోల సామర్థ్యం గల సబ్జి కూలర్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అదే విధంగా చిత్తూరు, తిరుపతి జిల్లా రైతుబజార్లలో ప్రత్యేక పైలట్ ప్రాజెక్టు కింద 13 కూలర్లు ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్రంలోని రైతుబజార్లలో వచ్చే నెలలోనే వీటిని ఏర్పాటు చేయబోతున్నట్లు ఏడీఎం నారాయణమూర్తి తెలిపారు.

శ్రీశైలంలో భక్తుల రద్దీ

శ్రీశైలం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ద్వాదశ జ్యోతిర్లింగం, అష్టాదశ శక్తిపీఠం శ్రీశైలం మహాక్షేత్రానికి ఆదివారం వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దీంతో ఆలయ క్యూలైన్లు, ప్రధాన వీధులలో రద్దీ నెలకొంది. రెండు తెలుగు రాష్ట్రాలు, దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్ల దర్శనార్థం తరలివచ్చారు. వేకువజాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి, గంగమ్మకు దీపహారతులు సమర్పించారు. అలాగే వందల సంఖ్యలో భక్తులు దేవస్థానం కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వామి, అమ్మవార్ల దర్శనార్థం క్యూలైన్లలో భక్తులు బారులు తీరారు. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు దేవస్థానం అధికారులు నిరంతరం తాగునీరు, అల్పాహారం అందజేశారు. క్షేత్రంలోని నిత్యఅన్నదాన సత్రాలు భక్తులకు వసతి, అన్నదానం నిర్వహించి భక్తుల సేవలో తరించారు.



కంపార్ట్‌మెంట్‌లో వేచి ఉన్న భక్తులు



క్యూలో నిలుచున్న భక్తులు

పోలీసుల కార్డన్ సెర్చ్

సరైన ధ్రువీకరణ పత్రాల్లేని 43 వాహనాలు సీజ్



కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): నేర నివారణ, శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా జిల్లా పోలీసులు అన్ని సబ్ డివిజన్లలో ఆది వారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. బేతంచెర్ల, కొలిమిగుండ్ల, శిరివెళ్ల, కోవెల కుంట్ల, బండిఆత్మకూరు, ముచ్చుమర్రి తదితర పోలీస్ స్టేషన్ల పరిధిలో కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. క్యూఆర్టీ టీం సిబ్బంది, స్థానిక పోలీసులు బృందాలుగా ఏర్పడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అను మానితులు, రౌడీషీటర్లు, నేరచరిత్రగలవారి ఇళ్లలో సోదాలు నిర్వహించి సరైన ధ్రువీకరణ పత్రాల్లేని సుమారు 43వాహనాలు, 27 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఆయా గ్రామాల్లో ప్రజలతో పోలీస్ అధికారులు సమావేశాలు నిర్వహించి నేరాలపై అవగాహన కల్పించారు. ఎవరైనా చట్టవ్యతిరేక కార్యక లాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్డన్‌సర్చ్ ఆపరేషన్ నిరంతర ప్రక్రియ అని పోలీస్ అధికారులు తెలిపారు.

19న జిల్లా వ్యాప్తంగా నిరసన

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా ఈ నెల 19న జిల్లా వ్యాప్తంగా నిరసనలకు వామపక్షాలు పిలుపునిచ్చినట్లు సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు డి.గౌస్‌దేశాయ్, బి.గిడ్డయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14 నుంచి 20 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని వామపక్షాలు పిలుపునిచ్చాయన్నారు. అందులో భాగంగా 19న అన్ని పట్టణ, మండల కేంద్రాల్లో నిరసనలు తెలియజేయాలని వారు తెలిపారు.

ప్రశాంతంగా కొనసాగిన ఇంటర్ ప్రాక్టికల్స్

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా కొనసాగాయి. ఉదయం జరిగిన ప్రాక్టికల్స్ పరీక్షలకు 58 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం విద్యార్థులు 2796 మంది నమోదు చేసుకున్నారు. ఇందులో 2729 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, 67 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం జరిగిన ప్రాక్టికల్స పరీక్షలకు 54 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం విద్యార్థులు 2178 మంది నమోదు చేసుకున్నారు. ఇందులో 2152 మంది పరీక్షకు హాజరు కాగా, 26 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ప్రాక్టికల్స్ పరీక్ష కేంద్రాలను ఆర్ఐవో కన్వీనర్ గురువయ్య శెట్టి, డీవీఈవో పరమేశ్వరరెడ్డి, స్పెషల్ ఆఫీసర్ జి.లాలెప్ప, డీఈసీ సభ్యులు నాగభూషణం రెడ్డి, పద్మావతి, స్క్వాడ్ బృందాల సభ్యులు పర్యవేక్షించారు.

పునర్జన్మపై నిత్యం పరిశోధనలు

ప్రముఖ మానసిక వైద్యుడు ఇండ్ల రామసుబ్బారెడ్డి



కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పునర్జన్మ అంశం అనేది ఎప్పుడూ ఆసక్తికరమేనని, దీనిపై నిత్యం పరిశోధనలు జరుగుతున్నాయని విజయవాడకు చెందిన ప్రముఖ మానసిక వైద్యనిపుణుడు డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి అన్నారు. ఆదివారం కర్నూలు మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థుల సంఘం నిర్వహించిన వైద్య విజ్ఞాన సదస్సుకు ఆయన హాజరైన పునర్జన్మ అన్ని అంశంపై మాట్లాడారు. పునర్జన్మ అనేది ఎప్పుడు అర్థం కాని సబ్జెక్టు అని అన్నారు. అన్ని మతాలు పునర్జన్మ ఉంటుందని నమ్ముతారని అన్నారు. పునర్జన్మలపై అనేక పరిశోధనలు జరుగుతున్నాయని, ఎక్కడ సైంటిఫిక్‌గా రుజువు కాలేదని చెప్పారు. అయితే చాలా మంది మళ్లీ జన్మ ఉందని నమ్ముతారన్నారు. బౌద్ధమతంలో కూడా దలైమలై వంటి గురువు కూడా పునర్జన్మ ఉంటుందని చెప్పారని గుర్తు చేశారు. మరీ కొందరు మానసిక రుగ్మతలు కలిగితన వారు పునర్జన్మల గురించి మాట్లాడుతారన్నారు. పునర్జన్మపై ఎవరి అభిప్రాయం వారిదన్నారు.

బెటాలియన్ హెడ్ కానిస్టేబుల్ ఆత్మహత్య

ఎర్రవల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా, ఎర్రవల్లి మండల పరిధిలోని ఎర్రవల్లి చౌరస్తాలో ఉన్న పదో బెటాలియన్ హెడ్ కానిస్టేబుల్ పవన్‌కుమార్ నాయుడు (36) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, నంద్యాల జిల్లా, పగిడాల గ్రామానికి చెందిన పవన్‌కుమార్ నాయుడు (2013 బ్యాచ్, పీసీ నెంబర్ 1203) బెటాలియన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆదివారం ఇంట్లో కుటుంబ సభ్యులు హాల్‌లో ఉన్న సమయంలో, బెడ్‌రూమ్‌లోకి వెళ్లి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గద్వాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. ఆయన ఆత్మహత్య పట్ల బెటాలియన్ కమాండెంట్ సాంబయ్య, సిబ్బంది విచారం వ్యక్తం చేశారు.

దరఖాస్తుల వెల్లువ

కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అర్బన్ హెల్త్ సెంటర్లలోని నాలుగు కేడర్ల పోస్టులకు దరఖాస్తులు వెలువెత్తాయి. వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు, ఫార్మసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్, డీఈవో, ఎల్‌జీఎస్ పోస్టులకు వాకిన్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. పోస్టులకు భారీగా అభ్యర్థులు రావడంతో దరఖాస్తులను స్వీకరించారు. ఫార్మసిస్టు పోస్టులకు 331, ల్యాబ్ టెక్నీషియన్‌లకు 275, డీఈవోలకు 263, ఎల్‌జీఎస్‌లకు 395 దరఖాస్తులు వచ్చాయి.

ప్రైవేటు కార్యక్రమాలకు అనుమతి లేదు

ఆలూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో ప్రైవేటు కార్యక్రమాలకు అనుమతి లేదని, ఇలా నిర్వహించుకోడానికి అనుమతి ఇచ్చిన హెచ్‌ఎంలపై చర్యలు తీసుకుంటామని రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిల్ సెక్రెటరీ ఉత్తర్వులు జారీ చేశారు. రాజకీయ, కుల, మతపరమైన కార్యక్రమాలతో పాటు వివాహాల నిర్వహణకు అనుమతులు ఇవ్వవద్దని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులు బేఖాతరు చేస్తే హెచ్‌ఎంలపై చర్యలు తప్పవని హెచ్చరించారు.



నిబంధనలు పాటించాలి

ప్రభుత్వ ఉత్తర్వులను జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు అమలు చేయాలి. ప్రభుత్వ తాజా ఉత్తర్వుల మేరకు పాఠశాలల ఆవరణల్లో కుల, మత, రాజకీయ, తదితర సమావేశాలు, సదస్సులు నిర్వహించకూడదు. ప్రధానోపాధ్యాయులు అలాంటి కార్యక్రమాలకు అనుమతి ఇవ్వకూడదు. నిబంధనలు అతిక్రమించడానికి వీల్లేదు

- శ్యామ్యూల్ పాల్, డీఈవో

ముగిసిన సీమ స్థాయి టెన్నిస్ పోటీలు

నంద్యాల హాస్పిటల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): నంద్యాలలోని రామకృష్ణా పీజీ కళాశాల మైదానంలో క్రీడా భారతి ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా జరుగుతున్న సీమస్థాయి టెన్నిస్ పోటీలు ఆదివారంతో ముగిసాయి. ముగింపు కార్యక్రమానికి డాక్టర్ రామకృష్ణారెడ్డి, హేమంత్‌రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని విజేతలకు బహుమ తులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టెన్నిస్ క్రీడా అభివృద్ధికి కృషిచేస్తామన్నారు. క్రీడాభారతి తరపున అన్ని క్రీడ ల అభివృద్ధికి కృషిచేస్తామన్నారు. ఈ పోటీల్లో అనంతపురం, ప్రకా శం, కర్నూలు, నంద్యాల జిల్లాల జట్లు పాల్గొన్నాయి. విజేతలకు నగ దు బహుమతితో పాటు కప్పులను అందజేశారు. వైద్యులు విష్ణు వర్ధన్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, పాండురంగా రావు, గోవర్ధన్ రెడ్డి, క్రీడాభారతి కార్యదర్శి నిమ్మకాయల సుధాకర్ పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

మహానంది, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మహానంది గ్రామానికి చెందిన సుధీర్ అనే యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ కలహాల వల్ల ఆదివారం పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడినట్లు తెలిసింది. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స కోసం నంద్యాలలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు

కేఆర్ఎంబీని కర్నూలులో ఏర్పాటు చేయాలి

మాజీ మంత్రి వడ్డె శోభనాద్రీశ్వరరావు



మాట్లాడుతున్న శోభనాద్రీశ్వరరావు

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కృష్ణానది యాజమాన్య బోర్డును కర్నూలులో ఏర్పాటు చేయాలని మాజీ మంత్రి వడ్డె శోభనాద్రీశ్వరరావు కోరారు. ఆదివారం కర్నూలు విచ్చేసిన ఆయన ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ కర్నూలులో బోర్డు ఏర్పాటు వల్ల శ్రీశైలం, నాగార్జునసాగర్ నదీ జలాల వాటా పంపకాలు, వాటి నిర్వహణ సులభతరం అవుతుందని అన్నారు. దీని వల్ల తెలంగాణలోని మహబూబ్‌నగర్, కర్నూలు జిల్లాలకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. జిల్లాలో తుంగభద్ర, కృష్ణా నదులు ఉన్నా.. పశ్చిమ ప్రాంతాన ఇప్పటికీ తాగు, సాగునీటికి ఇబ్బందులు పడటం బాధాకరమన్నారు. గుండ్రేవుల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణానికి నిధులు విడుదల చేసి త్వరితగతిన పూర్తి చేయాలని, ఇరు రాష్ట్రాలకు మేలు జరిగే ఈ అంశంపై ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రులు చర్చించుకోవాలని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం శ్రీశైలం రిజర్వాయర్ నుంచి పెద్ద ఎత్తున నీటిని విద్యుత్ ఉత్పత్తికి వినియోగిస్తున్నా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎందుకు అడ్డుకట్ట వేయలేకపోయిందని వడ్డే శోభనాదీశ్వరరావు ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలో దాదాపు రెండున్నర లక్షల ఇళ్లు నిర్మాణం చేపడితే నిధులలేమితో వాటిని లబ్ధిదారులకు పంపిణీ చేయక తాళాలు వేశారని గుర్తు చేశారు. వైసీపీ ప్రభుత్వంలో జగన్ ఆ ఇళ్లకు నీలి రంగు వేసి ప్రచారం చేసుకున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కొన్ని ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నా, అవి కాంట్రాక్టలకు కామధేనువుల మారాయే తప్ప, ప్రజలకు ఉపయోగపడటం లేదని విమర్శించారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయటం స్వాగతించదగ్గ విషయమని, కానీ ప్రభుత్వం ఏర్పడి 9 నెలలు కావస్తున్నా ఇంత వరకు భవన నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించకపోవటం బాధాకరమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతిని ప్రపంచంలోనే ఐదు పేరెన్నికగన్న నగరాల్లో ఒకటిగా నిలపాలని అనుకుంటున్నారని, దానికంటే రాష్ట్రంలో వెనకబడిన ప్రాంతాలు అబివృద్ధి చెందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆచరణ సాధ్యం కాని హామీలు, అవసరం లేని పనులను పక్కనపెట్టి సామాన్య ప్రజలకు ఉపయుక్తమైన పనులపై దృష్టి సారించి రాష్ట్రాన్ని హితవు పలికారు. రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జ దశరథరామిరెడ్డి మాట్లాడుతూ తెలుగు గంగ, హంద్రీనీవా, వెలిగొండ, వేదవతి రిజర్వాయర్లను పూర్తి చేయాలని డిమాండు చేశారు. గోదావరి, బానకచర్ల నీటి మళ్లింపు ఇప్పట్లో సాధ్యమయ్యే పనికాదని, కాబట్టి చిన్న ప్రాజెక్టులకు నిధులను కేటాయించి పూర్తి చేయాలన్నారు. కేఆర్‌ఎంబీని కర్నూలులో ఏర్పాటు చేయకపోతే.. ఈ సమస్య టీడీపీకి ఉరితాడు అవుతుందని హెచ్చరించారు. సమావేశంలో రైతు సంఘం ప్రతినిధులు రామకృష్ణ, రామచంద్రయ్య, జగన్నాథం, అనంతరపురం జలసాధన సమితి అధ్యక్షుడు రామ్‌కుమార్, రాయలసీమ విద్యావంతుల వేదిక కో కన్వీనర్ విజయ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళా చైతన్యానికి 'నరసం'

- పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి
- నగరంలో ఘనంగా నరసం సప్తమ రాష్ట్ర సదస్సు
- ప్రముఖుల చేతుల మీదుగా పుస్తకా ఆవిష్కరణ



పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డిని సత్కరిస్తున్న నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం ప్రతినిధులు

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మహిళా చైతన్యానికి నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం (నరసం) చేస్తున్న కృషి అభినందనీయమని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో నరసం సప్తమ వార్షికోత్సవ రాష్ట్ర సదస్సులో ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ సాహిత్యం ద్వారా విజ్ఞానం వికసిస్తుందని, మహిళలు తమ భావాలను పంచుకునేందుకు నరసం ఒక మంచి వేదికగా నిలుస్తోందని చెప్పారు. మరో అతిథి క్లస్టర్ యూనివర్శిటీ వీసీ ఆచార్య డీవీఆర్ సాయిగోపాల్ మాట్లాడుతూ నరసం చేపడుతున్న కార్యక్రమాలకు తమ వర్శిటీ ద్వారా సహాయ సహకారాలు అందిస్తున్నామని చెప్పారు. వర్శిటీ రిజిస్ట్రార్ ఆచార్య కట్టా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ యువతలో సాహిత్యాభిలాషను పెంపొందించేలా యూనివర్శిటీలు, కాలేజీలలో నరసం కార్యక్రమాలను విస్తృతం చేయాలని సూచించారు. కృష్ణాజిల్లా రచయితల సంఘం కార్యదర్శి, డాక్టర్ జీవీ పూర్ణచంద్ మాట్లాడుతూ సాహిత్య రంగంలో మహిళల పాత్ర మహోన్నతంగా నిలబెట్టడానికి నరసం పని చేస్తోందని అన్నారు. తెలుగు భాషా వికాస ఉద్యమం సంస్థ రాష్ట్ర కార్యదర్శి జేఎస్ఆర్‌కే శర్మ మాట్లాడుతూ మాతృభాషకు దూరమైపోతున్న నేటి తరానికి విలువలు నేర్పించడంలో నరసం ప్రతినిధులు భాగస్వామ్యం కావాలని కోరారు. గాడిచర్ల ఫౌండేషన్ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు కేసీ కల్కూర మాట్లాడుతూ గత చరిత్రలను నేటి తరాలకు అందించాల్సిన బాధ్యత రచయిత్రులపై ఉందని చెప్పారు. కథా రచయిత ఇనాయతుల్లా మాట్లాడుతూ అవిద్య, పేదరికంతో అనేక మంది మహిళలు నేడు తీవ్ర వ్యథలు అనుభవిస్తున్నారని అన్నారు. నరసం జిల్లా అధ్యక్షురాలు కేవీ సుబ్బలక్ష్మమ్మ అధ్యక్షత వహించిన ఈ సదస్సులో నరసం జిల్లా కార్యదర్శి డాక్టర్ దండెబోయిన పార్వతీదేవి, రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి. పుల్లయ్య, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, కరివేన బ్రాహ్మణ నిత్యాన్నదాన సత్రం కార్యదర్శి హెచ్‌కే మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల ఆవిష్కరణ

ఈ సభలో ప్రముఖ రచయిత్రి ఆరేపల్లి వరలక్ష్మమ్మ రాసిన బొమ్మతో బాలలు, శివలీలలు, బొమ్మతో ముచ్చట్లు, నరసం మహిళా ప్రతినిధులు 31 మంది రాసిన నరసం కర్నూలు కథల సంకలనం ఆవిష్కరించారు. అలాగే సమకాలీన సమస్యలు - రచయిత్రుల కర్తవ్యం అనే అంశంపై చర్చా గోష్టి నిర్వహించారు. కవి సమ్మేళనం నిర్వహించారు.

నరసం రాష్ట్ర అధ్యక్షురాలు తేళ్ల అరుణ మాట్లాడుతూ అనేక మహోన్నత ఆశయాలతో తమ సంస్థ పని చేస్తోందని అన్నారు. మహిళాభ్యుదయం దిశగా నరసం ప్రయాణం సాగుతుందని రాష్ట్ర కార్యదర్శి పాతూరి అన్నపూర్ణ అన్నారు. విద్య లేకపోవడం వల్లే అనేక అనర్థాలు జరుగుతున్నాయని ప్రముఖ రచయిత్రి తుర్లపాటి రాజేశ్వరి అన్నారు.

శాశ్వత అన్నప్రసాద పథకానికి విరాళం



దాతకు ప్రసాదం అందజేస్తున్న పర్యవేక్షకుడు రవి

శ్రీశైలం, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి ఆదివారం పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన యం. అనితచార్యులు అనే భక్తుడు రూ. 1,00,116 విరాళాన్ని పర్యవేక్షకుడు జి. రవికి అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు.

వివాదాస్పదంగా ప్రసాదాల కేంద్రం



ప్రసాదాల కౌంటర్

మహానంది, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి):.మహానంది దేవస్థానంలో భక్తులకు ప్రసాదాలు విక్రయించే కౌంటర్‌లో ఆలయ సిబ్బంది కాకుండా మరో వ్యక్తి విధులు నిర్వహించడం వివాదాస్పదంగా మారింది. ఈ వ్యక్తి గత కొన్ని రోజులుగా లడ్డు ప్రసాదాలు విక్రయిస్తున్నాడు. మహానంది దేవస్థానానికి ఆరు నెలల క్రితం శ్రీశైలం నుండి జూనియర్ అసిస్టెంట్ అనూరాధ బదిలీపై వచ్చారు. ఆమెకు ప్రసాదాల కౌంటర్ వద్ద ఉదయం వేళల్లో విధులు నిర్వహించేలా మహానంది దేవస్థానం అధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. అయితే ఆమె తన కుమారుడ్ని కూడ తన విధుల్లో భాగం చేసింది. దీన్ని ఆలయ అధికారులు పట్టించుకోక పోవడం మహానందిలో వివాదాస్పదంగా మారింది. కౌంటర్‌లో ఉద్యోగి అనూరాధ కొడుకు భక్తులకు చిల్లర ఇవ్వకపోగా దురుసుగా ప్రవర్తించడం చర్చనీయాంశమైంది. దీన్ని ఆలయ అధికారులు పట్టించుకోకపోవడంపట్ల విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

'ఎస్టీ పునరుద్ధరణకు కృషి'



మాట్లాడుతున్న ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): వాల్మీకుల ఎస్టీ పునరద్ధరణకు కృషి చేస్తామని ఆ సామాజిక వర్గానికి చెందిన ప్రజాప్రతిధులు అన్నారు. వాల్మీకి న్యాయవాదుల ఆత్మీయ సమ్మేళనం, వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన ప్రజాప్రతినిధుల సన్మాన సభను ఆదివారం ఏపీ వాల్మీకి అడ్వకేట్స్ అసోసియేషన్ జేఏసీ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో నిర్వహంచారు. కర్నూలు నగరంలోని సూరజ్ గ్రాండ్ హోటల్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా హాజరైన వాల్మీకి ప్రజాప్రతినిధులు ఎమ్మెల్సీ బీటీ నాయుడు, ఎమ్మెల్సీ డా.మధుసూదన్, ఆదోని ఎమ్మెల్యే డా.పార్థసారధి, టీడీపీ ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వాల్మీకి బోయలు ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరణ కోసం త్వరలో కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. గతంలో వాల్మీకులలో చైతన్యం తేవడం కోసం సింహ గర్జనలు చేశామన్నారు. వాల్మీకి బోయ జేఏసీ చైర్మన్ డా.భవానీప్రసాద్, కర్నూలు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు నాగభూషణం, శంకర్, భాస్కర్‌నాయుడు, వీరేష్, ఆనంద్, మద్దిలేటి స్వాములు, ఎన్.రాజేష్, బి.వెంకటేశ్వర్లు, భరత్ రవి, పద్మావతి, సంజమ్మ, శిల్ప, శ్రీలత, వరలక్ష్మి, శశిరేఖ, పలు బార్ల న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

రుద్ర కోటేశ్వరాలయంలో పారిశుధ్య పనులు



ఆలయ ప్రాంగణంలో పారిశుధ్య పనులు చేస్తున్న సభ్యులు

ఆత్మకూరురూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నంద్యాలకు చెందిన మన ఊరు మన గుడి మన బాధ్యత టీం సభ్యులు ఆత్మకూరు మండలంలోని రుద్ర కోటేశ్వరాలయ పరిసరాలను ఆదివారం శుభ్రం చేశారు. నంద్యాల నుండి ఆ సంస్థకు చెందిన శివకుమార్‌రెడ్డి, రఘువీర్ వెంకటేష్ హరికృష్ణ ఆధ్వర్యంలో 110 మంది టీం సభ్యులు ఈ సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. అందులో 50 మంది మహిళలు ఉన్నారు. వీరు ఆలయ ప్రాంగణంలోని కోనేరును శుభ్రపరిచి నాలుగు ఎకరాల్లో ఉన్న గుడి ప్రాంగణాన్ని, ఆర్యవైశ్య సత్రాన్ని, అన్నదాన సత్రాన్ని శుభ్రపరిచారు. వీరికి ఆలయ కమిటీ అధ్యక్షుడు రాఘవరెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

అనాథగా నవజాత శిశువు

- వదిలి వెళ్లిన గుర్తు తెలియని వ్యక్తులు
- శిరివెళ్ల మండలం జీనేపల్లెలో ఘటన



శిశువును శిశుగృహ మేనేజర్‌కు అప్పగిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

శిరివెళ్ల, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి) : అమ్మ పొత్తిళ్లలో ఉండాల్సిన శిశువు ఇండ్ల మధ్య బహిరంగ ప్రదేశంలో గుక్కపెట్టి ఏడుస్తూ కనిపించింది. ఈ హృదయ విదారక ఘటన శిరివెళ్ల మండలం జీనేపల్లె గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కూలీలను పిలిచేందుకు ఆదివారం తెల్లవారుజామున వెళ్తుండగా ఎస్సీ కాలనీలో శిశువు ఏడుపు వినిపించింది. అటువైపు వెళ్లి చూడగా ముక్కుపచ్చలారని ఓ ఆడ శిశువు కనిపించింది. ఆయన స్థానికులను పిలవడంతో వారు వచ్చి చూశారు. మహిళలు శిశువును అక్కున చేర్చుకొని సపర్యలు చేశారు. సమాచారం తెలుసుకున్న అంగన్‌వాడీ సిబ్బంది కాలనీకి చేరుకుని శిశువును చికిత్స నిమిత్తం 108 వాహనంలో నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. నంద్యాల శిశుగృహ మేనేజర్ మల్లేశ్వరికి వారు శిశువును అప్పగించారు. బిడ్డ ఆరోగ్యం నిలకడగా ఉందని ఆమె తెలిపారు. ఈ ఘటనపై శిరివెళ్ల పోలీసులు, ఐసీడీఎస్ అధికారులు, వైద్య సిబ్బంది విచారణ జరుపుతున్నారు.

మద్యం మత్తులో తండ్రిని హత్య చేసిన కుమారుడు



నారాయణ (ఫైల్)

ఓర్వకల్లు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో కుమారుడు తండ్రిని హత్య చేసిన ఘటన కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలంలోని నన్నూరు గ్రామంలో ఆదివారం జరిగింది. వివరాలివీ.. నన్నూరు గ్రామం ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్న తండ్రి నారాయణ (45), నవీన్ కుమార్ (20) ఇద్దరూ మద్యం మత్తులో గొడవపడ్డారు. ఈ క్రమంలో కొడుకు కర్ర, బండరాయితో తండ్రి తలపై మోదడంతో నారాయణ అక్కడికక్కడే మృతి చెందాడు. ట్రైనీ డీఎస్పీ ఉషశ్రీ, కర్నూలు సీఐ చంద్రబాబు నాయుడు, ఎస్ఐ సుధీర్ కుమార్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. నవీన్ కుమార్ పోలీసుల అదుపులో ఉన్నాడు. నారాయణకు భార్య రాములమ్మ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. హత్యకు గల పూర్తి కారణాలు తెలియాల్సి ఉంది. భార్య రాములమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సునీల్ కుమార్ తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): కుటుంబాన్ని పోషించలేని స్థితిలో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడిన అత్యంత విషాదకర సంఘటన కొలిమిగుండ్ల మండలం చింతలాయపల్లె మజారా గ్రామమైన ఎస్.చెన్నంపల్లె గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాలివీ.. గ్రామానికి చెందిన బోయ అంజి(39) ఇంట్లో ఎవ్వరూలేని సమయంలో ఉరి వేసుకున్నారు. అంజి భార్య సుప్రియ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు.

ముగ్గురిపై కేసు నమోదు

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): భర్త, అత్తమామలు వేధింపులకు గురి చేస్తున్నారని కోవెలకుంట్ల పట్టణానికి చెందిన కె.రేష్మా ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ కృష్ణానాయక్ తెలిపారు. వివరాలివీ.. కోవెలకుంట్లకు చెందిన సద్దాంహుసేన్ కుమార్తె రేష్మాకు శిరివెళ్ల మండలం ఎర్రగుంట్లకు చెందిన కట్టుబడి ఫక్రుద్దీన్ కుమారుడు సద్దాంహుసేన్‌తో ఆరేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కూతుర్లు ఉన్నారు. ప్రస్తుతం ఆమె ఐదు నెలల గర్భిణి. తనను, పిల్లలను సరిగా పట్టించుకోలేదని ఆమె తెలిపింది. ఈ విషయంపై భర్తను ప్రశ్నించగా తనను నానాబూతులు తిట్టి కొట్టాడని శారీరకంగా మానసికంగా హింసిస్తున్నాడని తెలిపింది. అంతేకాకుండా అత్త కుర్షాద్, మామ ఫక్రుద్దీన్ కూడా వేధిస్తున్నారని తెలిపింది. తాను జరిగిన విషయాన్ని తన తల్లిదండ్రులకు చెప్పి సుమారు 20రోజుల క్రితం కోవెలకంట్లల నివాసం ఉంటున్న తల్లిదండ్రుల వద్ద ఉంటున్నట్లు తెలిపారు. తన తల్లిదండ్రులు తన భర్త అత్తమామలతో మాట్లాడి తనను కాపురానికి పంపించాలని సర్దిచెప్పాలని ప్రయత్నించగా అందుకు నిరాకరించారని తెలిపారు.

ప్రారంభాలు.. పరామర్శలు



మామిడి నాగరాజును పరామర్శిస్తున్న ఫిరోజ్

నంద్యాల మున్సిపాలిటీ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): తెలుగు దేశం పార్టీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ ఆదివారం పలు కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. ఉదయం ఎనిమిది వార్డుల్లోని ఉప్పరిపేటలో ఉన్న బాలయేసు ప్రార్థనాలయంలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, న్యాయవాది వెదుళ్ల రామచంద్రారావు, జనసేన నంద్యాల సమన్వయకర్త పిడతల సుధాకర్‌లతో కలిసి పద్మావతి నగర్‌లోని కృష్ణ మందిరం దగ్గర ది పర్‌ఫెక్ట్ ధమ్ బిర్యాని హోటల్‌ను ప్రారంభించారు. సాంబవరం మెట్ట సాయిబాబ గుడి ప్రాంతలో శిరిడి సాయి వెంచర్‌ను ప్రారంభించారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న 37వ వార్డు ఇన్‌చార్జి మామిడి నాగరాజు ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఫిరోజ్ వెంట ఆయా కార్యక్రమాల్లో 8 వార్డు ఇన్‌చార్జి ఉప్పరి సురేష్ కుమార్, మామిడి ఉషారాణి, గోపాల్ రెడ్డి ఉన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం



మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ మల్లికార్జున గుప్త

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా పని చేస్తున్నామని ట్రాఫిక్ సీఐ బి.మల్లికార్జున గుప్త అన్నారు. ఆదివారం రోడ్డు సేఫ్టీపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ కార్యక్రమాన్ని ఎస్వీఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ట్రాఫిక్ ఉల్లంఘనలు, వాటి జరిమానాలు, ప్రమాదాల కారణాలు, బాధ్యతాయుతమైన డ్రైవింగ్ వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రమాదాలు చాలా వరకు మానవ తప్పిదాల వల్లే జరుగుతాయని, అవి ఎన్ని రకాలుగా ఉంటాయో అని విద్యార్థులకు వివరించడంతోపాటు గోల్డెన్ అవర్‌చికిత్స ప్రాముఖ్యతను వివరించారు. హిట్‌అండ్ రన్ కేసుల్లో ప్రభుత్వ ప్రయోజనాలు, బాధితులకు ప్రభుత్వం తరఫు నుంచి వచ్చే ప్రయోజనాలు, రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన ఇతర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

నెహ్రూనగర్‌లో పోలీసుల తనిఖీలు



నెహ్రూనగర్ గ్రామస్థులతో మాట్లాడుతున్న సీఐ, ఎస్ఐలు

పగిడ్యాల, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : ముచ్చుమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని నెహ్రూనగర్ గ్రామంలో నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రమణ్యం, ఎస్ఐ శరత్ కుమార్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఆదివారం తెల్లవారు జామున తనిఖీలు నిర్వహించారు. గ్రామంలోని బెల్టుషాపు నిర్వాహకులు, అనుమానితుల ఇళ్లలో సోదాలు నిర్వహించారు. అనతరం వారు గ్రామస్థులతో మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజల శాంతి భద్రతలకు ఇబ్బదులు కలిగిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

భక్తులతో మర్యాదగా ప్రవర్తించాలి: సీఐ

సున్నిపెంట, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైలం వచ్చే భక్తుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలని సీఐ ప్రసాదరావు అన్నారు. ఆదివారం పోలీసుస్టేషన్ ఆవరణలో సత్రం నిర్వాహకులతో మాట్లాడారు. క్షేత్ర పరిధిలో ఉన్న గదులకు ఎక్కువ అద్దె వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రతి సత్రం ఆవరణలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సత్రల ఆవణలో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు, జూదం, మద్యం సేవించడం, మాంసాహారంపై నిషేధం ఉందని తెలిపారు. ఇందుకు విరుద్ధంగా ప్రవర్తించిన వారిపై దేవదాయ ధర్మాదాయ చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సత్రాల ప్రాంగణంలో ముందస్తు అనుమతులు లేకుండా సభలు, సమావేశాలు నిర్వహించ కూడదని, ఎలాంటి గొడవలు జరిగినా సత్రనిర్వాహకులే బాధ్యత వహించాలని అన్నారు. ప్రతి సత్రంలో గదుల వివరాలను సూచిక బోర్డులపై నమోదు చేయాలని చెప్పారు.

క్లస్టర్ కష్టాలు తొలగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ నాయకుడు

నంద్యాల ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): టీచర్లను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలు రద్దు చేయాలని ఏపీటీఎఫ్ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. నంద్యాలలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర అకాడమిక్ కమిటీ సభ్యులు సాంబశివుడు, నంద్యాల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాధవస్వామి, శ్రీనివాసులు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం 117 ఉత్తర్వులతో ప్రాథమిక పాఠశాలలను నిర్వీర్యం చేసిందని, నేడు కూడా ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురి చేసే విధంగా క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో సుదూరంగా ఉన్న క్లస్టర్ కాంప్లెక్స్ పాఠశాలలకు సరైన రవాణా సౌకర్యం లేక మహిళా ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

అమరావతికి ఆర్టీసీ బస్సులేవి..?

స్థానిక డిపో నుంచి బస్సు సర్వీసులు లేక ప్రయాణికుల అవస్థలు



ఆత్మకూరు బస్టాండ్‌లో కర్నూలు-2 డిపో బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

ఆత్మకూరు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన నేపథ్యంలో నవ్యాంధ్ర రాజధాని అమరావతికి వెళ్లేందుకు ఆత్మకూరు ప్రాంత ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. స్థానిక డిపో నుంచి అమరావతికి బస్సు సర్వీసులు అందుబాటులో లేకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. వాస్తవానికి రాష్ట్ర విభజన అనంతరం 2014లో విజయవాడ కేంద్రంగా అమరావతి పేరుతో రాజధానిని ప్రకటించారు. దీంతో అమరావతికి రాకపోకలకు కీలకంగా మారాయి. ప్రత్యేకించి సాధారణ ప్రయాణికులతోపాటు ఉన్నత విద్య కోసం వెళ్లే విద్యార్థులు, రాష్ట్ర స్థాయి రాజకీయ పార్టీల నాయకులను సంప్రదించేందుకు వెళ్లే నాయకులు, గుంటూరు మిర్చి యార్డులో మిరప అమ్మకాలు సాగించే రైతులతో సహా తరుచూ ఇక్కడి నుంచి అమరావతికి రాకపోకలు సాగిస్తుంటారు. అయితే ఆత్మకూరు డిపో నుంచి అమరావతికి ఎలాంటి బస్సు సర్వీసు అందుబాటులో లేకపోవడంతో విజయవాడ, గుంటూరు ప్రాంతాలకు వెళ్లాలంటే ఇక్కడి ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. వాస్తవానికి ఉమ్మడి కర్నూలు జిల్లాలోని అనేక ఆర్టీసీ డిపోల నుంచి విజయవాడకు బస్సు సర్వీసులు నడుస్తున్నాయి. అందులో కర్నూలు-1, ఆదోని, ఎమ్మిగనూరు, డోన్, నందికొట్కూరు డిపోలకు చెందిన బస్సులు ఆత్మకూరు మీదుగానే వెళ్తుంటాయి. అయితే ఆయా డిపోలకు చెందిన బస్సుల్లో ముందస్తుగానే సీట్ల రిజర్వేషన్ భర్తీ కావపోవడంతో సమస్య నెలకొంది. దీంతో కొందరైతే తమ అవసరాల నిమిత్తం చేసేది ఏమీ లేక బస్సులో నిలబడి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఇతర రాష్ట్రాల రాజధాను లైన హైదరాబాద్, బెంగుళూరు నగరాలకు ఆత్మకూరు ఆర్టీసీ డిపో నుంచి బస్సు సర్వీసులు వెళ్తున్నప్పటికీ సొంత రాష్ట్ర రాజధానికి బస్సులు ఏర్పాటు చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ప్రయాణికుల ఇబ్బందులు పట్టని ఏపీఎస్ ఆర్టీసీ:

రాజధాని అమరావతికి వెళ్లేందుకు ఆత్మకూరు ప్రాంతవాసులు పడుతున్న కష్టాలను దృష్టిలో ఉంచుకుని గతంలో అనేకమార్లు ప్రజా సంఘాలతో పాటు ఆర్టీసీ యూనియన్ల నాయకులు సైతం ఈ సమస్యను ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. ఈ ప్రాంతానికి చెందిన ఎంతో మంది విద్యార్థులు గుంటూరు, విజయవాడ ప్రాంతాల్లో విద్యనభ్యసిస్తున్నారు. అలాగే ఇటీవల కాలంలో ఆత్మకూరు, వెలుగోడు, కొత్తపల్లి, పాములపాడు మండలాల్లో విస్తారంగా మిరప పంటను సాగు చేస్తున్నారు. రైతులు తమ దిగు బడులను విక్రయించుకునేందుకు గుంటూరు మిర్చి యార్డుకు వెళ్లాల్సి వస్తోంది. అలాగే రాష్ట్ర స్థాయి పరిపాలక కార్యాలయాలన్ని విజయవాడలోనే ఉండటం వల్ల వివిధ అవసరాల నిమిత్తం ఉద్యోగులు సైతం రాజధానికి వెళ్లాల్సి వస్తుంది. అయితే స్థానికంగా ఆర్టీసీ బస్సులు అందుబాటులో లేకపోవడంతో సాధారణ ప్రయాణికులతోపాటు ఆయా అవసరాల కోసం వెళ్లేవారికి ఇబ్బందులు ఎదురవు తున్నాయి. ఇతర డిపోల నుంచి ఏ సమయా నికి బస్సులు అందుబాటులో ఉంటాయో కూ డా తెలియని పరిస్థితులు ఉన్నాయి. ఒకవేళ బస్సులు అందుబాటులో ఉన్నా.. అందులో సీట్లు ఉంటాయో లేదో కూడా ప్రశ్నార్థకంగా ఉంది. ఈ సమస్యపై స్థానిక శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని రవాణాశాఖ మంత్రి దృష్టికి సమస్యను తీసు కెళ్లి పరిష్కరించేందుకు చొరవ తీసుకోవాలని ఇక్కడి ప్రజలు ఆశిస్తున్నారు.

ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తాము



ఆత్మకూరు ఆర్టీసీ డిపో నుంచి అమరావతికి బస్సు సర్వీసులు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్న విషయంపై ఇప్పటికే మాదృష్టికి వచ్చింది. ఈ విషయాన్ని ఆర్టీసీ కడప జోనల్ అధికారులు దృష్టికి తీసుకెళ్లి బస్సు సర్వీసుల ఏర్పాటు అంశాన్ని పరిశీలిస్తాం. వీలైనంత త్వరగా అమరావతికి ఆర్టీసీ బస్సులను అందుబాటులో ఉంచేందుకు ప్రయత్నం చేస్తాం.
- వినీత్‌కుమార్, ఆర్టీసీ డిపో మేనేజర్, ఆత్మకూరు:

'శిల్పా.. తెలుసుకొని మాట్లాడు'



మాట్లాడుతున్న బన్నూరు రామలింగారెడ్డి

నంద్యాల మున్సిపాలిటీ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఆత్మకూరు మండలంలోని నారాయ ణపురం గ్రామస్థుడు పుల్లయ్య కేసు విషయంలో నిజాలు తెలుసుకుని మాట్లాడాలని కేసీ కెనాల్ నీటి సంఘాల చైర్మన్ బన్నూరు రామలింగా రెడ్డి అన్నారు. ఆదివారం నంద్యాలలో నిర్వహించిన విలేకరుల సమావే శంలో ఆయన మాట్లాడారు. గ్రామంలోని పలువురు రైతులను డబ్బు అహంకారంతో కత్తులతో బెదిరించిన పుల్లయ్య కేసు భయంతో పురుగు ల మందు తాగినట్టు డ్రామా ఆడుతున్నాడని ఆరోపించారు. ఆత్మకూరు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి కక్ష సాధింపు రాజకీయలకు పాల్పడుతున్నారని ఆరోపించిన శిల్పా గత ఐదేళ్లలో అభివృద్ధి కంటే అరాచకాలకే ప్రాధాన్యత ఇచ్చాడని విమర్శించారు.

వృద్ధులకు ఆయుష్మాన్ సంజీవని

నంద్యాల మున్సిపాలిటీ, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): వృద్ధులకు ఆయుష్మాన్ భారత్ పథకం సంజీవని లాంటిదని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ తూము శివారెడ్డి అన్నారు. 70 ఏళ్లు నిండిన వృద్ధులకు ఈ పథకం వర్తింపజేయాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయం వెంటనే అమలులోకి వస్తుందని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నిరాదారణకు గురవుతున్న సీనియర్ సిటిజన్లుకు ఉచితంగా మందులు పొందే అవకాశం ఉందని ఉద్ఘాటించారు.

స్వామి వారికి తులాభార విరాళం



భక్తులను సత్కరిస్తున్న ఆలయ సిబ్బంది

పాణ్యం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి భక్తులు ఆదివారం తులాభార విరాళాన్ని సమర్పించినట్లు ఆలయ ఈఓ రామకృష్ణ తెలిపారు. గోస్పాడు మండలం తేళ్లపురి గ్రామ సర్పంచ్, కాటంరెడ్డి సుధామణి, టీడీపీ మండల కన్వీనర్ కాటంరెడ్డి తులసీశ్వరరెడ్డి దంపతులు స్వామివారి మొక్కులో భాగంగా తమ మనుమడు సూర్యవెంకట దేవాన్షురెడ్డి తులాభారం నిర్వహించారన్నారు. అలాగే కేశఖండన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. తులాభారంలో వచ్చిన ఆదాయం స్వామివారి హుండీలో వేసి నట్లు తెలిపారు. ఈ సందర్భంగా భక్తులతో పంచామృతాభిషేకం, కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ సిబ్బంది ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో క్రిష్ణమోహన్‌రెడ్డి, శ్వేత, మల్లేశ్వరరెడ్డి, అరుణ, ఈశ్వరరెడ్డి, సంధ్య ఆలయ అర్చకులు నారాయణస్వామి పాల్గొన్నారు.

కొనసాగుతున్న నిర్మాణాల కూల్చివేతలు

పాములపాడు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పాములపాడులో అక్రమ నిర్మాణాల నిర్మాణాల కూల్చివేతలు కొనసాగుతున్నాయి. స్థానిక బస్టాండు కూడలిలో వ్యాపారులు తమ దుకాణాల ముందు అక్రమ నిర్మాణాలను చేపట్టడంతో ప్రయాణికులు నిలవడానికి కూడా వీలు లేకుండాపోయింది. పైగా ట్రాఫిక్ సమస్య తలెత్తింది. దీంతో కొంత మంది వ్యాపారులు స్వచ్ఛందంగా పంచాయతీ అధికారులు సూచించిన మేర రేకులు, ఫుట్‌పాత్‌లను తొలగించారు.

జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చాటాలి

కర్నూలు స్పోర్ట్స్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): చెన్నైలో ఈ నెల 17 నుంచి 20 వరకు నిర్వహించే జాతీయ స్థాయి పారా స్పోర్ట్స్ పోటీల్లో ప్రతిభ చాటి ప్రథమ స్థానం సాధించాలని రాష్ట్ర పరిశ్రమ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. ఇటీవల మంగళగిరిలో నిర్వహించిన 6వ బెటాలియన్ క్రీడా మైదానంలో పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి పోటీలు జరిగాయి. ఈ పోటీలో జిల్లాకు 11 బంగారు, 8 సిల్వర్, 3 బ్రాంజ్ మెడల్స్ సాధించారు. రాష్ట్ర విజేతలకు మంత్రి టీజీ భరత్ మెడల్స్ ప్రశంసాపత్రాలు అందజేశారు.

అవినీతి లేని సమాజంలోనే ప్రజా సంక్షేమం



సమావేశంలో ప్రసంగిస్తున్న ఆకుమళ్లరహీం

నంద్యాల రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): అవినీతి రహిత సమాజ నిర్మాణంతోనే ప్రజా క్షేమం సాధ్యమవుతుందని ఏక్తా యాంటీ కరెప్షన్ జాతీయ సంస్థ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు మహబూబ్ బాషా అన్నారు. ఆదివారం నంద్యాల ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతిని అరికట్టే విధంగా ప్రజలను చైతన్యవంతులను చేయడమే తమ సంస్థ లక్ష్యమన్నారు. అవినీతి కార్యక్రమాలు జరుగుతుంటే తమ దృష్టికి తేవాలని, తద్వారా పీడిత, బాధిత ప్రజలకు అండగా ఉంటామన్నారు. అనంతరం ప్రజాస్వామ్య ఐక్య వేదిక జిల్లా అధ్యక్షులు ఆకుమళ్ల రహీం మాట్లాడుతూ కుల, మతాలకు అతీతంగా ప్రజలకు మంచి చేసే విధంగా పాటుపడుతామన్నారు. సమాజ హితం కోసం ప్రతి ఒక్కరికీ సహకరిస్తామన్నారు. కార్యక్రమంలో అల్తాఫ్, రఫీ, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సామాన్యుల బడ్జెట్ కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

నంద్యాల రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం సంపన్నుల బడ్జెట్ ప్రవేశపెట్టిందని, సామాన్యులకు ఉపయోగపడే బడ్జెట్ కావాలని వామపక్షాలు డిమాండ్ చేశాయి. ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో వామపక్షాలు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించాయి. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగరాజు మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ రంగాలకు కేటాయింపులు పెంచాలన్నారు. ఉపాధి హామీ పథకానికి 50 శాతం నిధులు పెంచాలని కోరారు. కేంద్ర ప్రాయోజిత పథకాలకు నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. పెట్రోలియం ఉత్పత్తులపై సర్ చార్జీలను రద్దు చేయాలని, ఆహారభద్రత చట్టాన్ని అమలు చేయాలని కోరారు. సమావేశంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసి జిల్లా నాయకులు శంకర్, జనవిజ్ఞాన వేదిక జిల్లా నాయకులు రామరాజు, పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షులు రాంబాబు, డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి శివ తదితరులు పాల్గొన్నారు.

బాలుడికి ఆర్థిక సాయం

కొత్తపల్లి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): అరుదైన క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న ఓ బాలుడికి అతని తండ్రి, స్నేహితులు ఆర్థిక సాయం అందించారు. మండలంలోని పాతమాడుగుల గ్రామానికి చెందిన తెలుగు అశోక్, గంగమ్మలకు ఇద్దరు కుమారులు. వీరిలో చిన్నవాడైన బెస్త రిషికేష్ (5)కు గత రెండు నెలల నుంచి అరుదైన క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. అశోక్, గంగమ్మలు వ్యవసాయ కూలీలు. వివిధ రకాల హాస్పిటల్స్‌లో దాదాపు రూ.లక్షన్నర ఖర్చు పెట్టి వైద్యం చేయించా రు. ఎక్కువ ఖర్చుతో కూడుకున్న వైద్యం కావడంతో ఆర్థిక సమస్యలతో బాధపడుతున్నారు. అశోక్ స్నేహితులు భీష్మాచారి, నంద్యాల నరహరి, సత్యం, డా.రాము, సంతప్‌కుమార్‌లు కర్నూలు విశ్వభారతి క్యాన్సర్ ఆసుపత్రికి చికిత్స పొందుతున్న రిషికేష్‌ను పరామర్శించారు. రూ.42 వేల ఆర్థిక సాయం అందజేశారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న మిత్ర బృందం

నేడు శివపార్వతుల గ్రామోత్సవం



శివపార్వతుల ఉత్సవమూర్తులు

ఆత్మకూరు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలోని అతి పురాతన అంబాసిద్దేశ్వరాలయం శివస్వాముల ఆధ్వర్యంలో సోమవారం శివపార్వతుల గ్రామోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా అయ్యప్పస్వామి ఆలయం నుంచి కేజీ రోడ్డు, గౌడ్ సెంటర్, కప్పలకుంట, తోటగేరి, గాంధీపార్కు, పెద్దబజారు మీదుగా అంబా సిద్దేశ్వరాలయం వరకు గ్రామోత్సవం జరపనున్నారు. మధ్యాహ్నం శివస్వాములకు శ్రీవెంకటేశ్వర స్వామి కళ్యాణ మంటపంలో శ్రీశైలం ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ వంగాల శివరామిరెడ్డి అన్నదానం చేయనున్నారు.

నేడు ఆత్మలింగేశ్వరాలయ పదో వార్షికోత్సవం

ఆత్మకూరు పట్టణంలోని పాతబస్టాండ్‌లో వెలసిన ఆత్మలింగేశ్వర స్వామి ఆలయ పదవ వార్షికోత్సవం సోమవారం జరగనుంది. ఇందులో భాగంగా ప్రాతఃకాలంలోనే స్వామిఅమ్మవార్లకు విశేష అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. మధ్యాహ్న, సాయంకాల హారతులను సంప్రదాయబద్ధంగా నివేదించనున్నారు. అనంతరం రాత్రి 7గంటల సమయంలో శివపార్వతుల కళ్యాణోత్సవాన్ని నిర్వహించనున్నారు.

కార్పొరేట్ శక్తులకు మేలు చేసేలా కేంద్ర బడ్జెట్



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం

ఆత్మకూరు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ శక్తులకు మేలు చేసేలా కేంద్ర బడ్జెట్ ఉందని సీపీఎం నాయకులు ఏసురత్నం, వైసీపీ నాయకులు రాజమోహన్‌రెడ్డి, సయ్యద్‌మీర్ అన్నారు. ఆదివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో కేంద్ర బడ్జెట్‌పై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో మరోసారి ఏపీకి అన్యాయం జరిగిందన్నారు. విశాఖ రైల్వేజోన్, ఎస్ఐటీ, ఐఐటీ, ఐఐఎం, ట్రిబుల్ ఐటీ, ఐఐఎస్ఈఆర్, గిరిజన యూనివర్సిటీ, సెంట్రల్ యూనివర్సిటీ, విశాఖ స్టీల్ ప్లాంట్, కడప, స్టీల్, దుగ్గరాజుపట్నం పోర్టు, ఉత్తరాంధ్ర జిల్లాకు ప్యాకేజీ, రాజధాని నిర్మాణానికి నిధుల ప్రస్థావనే లేకుండా చేశారని అన్నారు. అలాగే పంటలకు గిట్టుబాటు ధరల జాడే లేదన్నారు. కేంద్ర బడ్జెట్‌ను ప్రజాస్వామ్య వాదులు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వెంకటస్వామిగౌడ్, రాజశేఖర్, శీలం శేషు, శ్రీనివాసులు, రణధీర్, సుధాకర్, కరుణాకర్, శివుడు, రామ్‌నాయక్, వీరన్న పాల్గొన్నారు.

ఏడేళ్ల తర్వాత ఒక్కటైన దంపతులు



ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ రాము

ఆత్మకూరు, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): ఏడేళ్ల క్రితం కలహాలతో విడిపోయిన దంపతులు ఎట్టకేలకు ఆత్మకూరు పోలీసుల చొరవతో మళ్లీ ఒక్కటయ్యారు. ఆత్మకూరు అర్బన్ సీఐ రాము తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆత్మకూరు మండలంలోని కురుకుంద గ్రామానికి చెందిన పుణ్యవతికి సున్నిపెంటకు చెందిన వెంకటకృష్ణతో 20 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం ఉన్నారు. కుటుంబంలో చోటు చేసుకున్న కలహాల కారణంగా ఏడేళ్లుగా వారు కలిసి ఉండటం లేదు. అయితే పుట్టింటిలోనే ఉంటున్న పుణ్యవతి ఆత్మకూరు పోలీసులను సంప్రదించి తాను భర్తతో కలిసి జీవించేందుకు సిద్ధంగా ఉన్నానని, ఇద్దరిని కలపాలని విన్నవించుకున్నారు. ఇందుకు స్పందించిన పోలీసులు వెంకటకృష్ణను ఆత్మకూరు పోలీసుస్టేషన్ పిలిపించి మూడు దఫాలుగా ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆదివారం మరోసారి స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇవ్వడంతో కలిసి కాపురం చేసేందుకు వారు అంగీకరించినట్లు తెలిపారు. వెంటనే పుణ్యవతిని, ఆమె పిల్లలను భర్త వెంట సున్నిపెంటకు పంపించారు. ఈ ఫ్యామిలీ కౌన్సెలింగ్‌లో అడ్వకేట్ నూర్‌అహ్మద్, సీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరమ్మ, సామాజికవేత్త అల్తాఫ్‌హుసేన్ ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ రవికృష్ణ

నంద్యాల హాస్పిటల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): నంద్యాల శ్రీ సాయిబాలాజీ నర్సింగ్ హోంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. నర్సింగ్‌హోం నిర్వాహకులు డాక్టర్ హరినాథ రెడ్డి, డాక్టర్ లక్ష్మీప్రసన్నల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ సామాజిక సేవలో వైద్యు లు ఎప్పుడూ ముందుంటారని అన్నారు. షుగర్, బీపీ, గుండె జబ్బు లు ముందుగానే గుర్తించి చికిత్స చేయించుకోవడం ద్వారా ప్రాణా పాయ స్థితి నుంచి తప్పించుకోవచ్చన్నారు. డాక్టర్ హరినాథరెడ్డి మాట్లాడుతూ శిబిరంలో 300 మంది రోగులను పరీక్షించి రూ.3 లక్షల మందులను రోగులకు ఉచితంగా అందజేశామన్నారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ పణీల్‌కుమార్, డాక్టర్ రమణారెడ్డి, డాక్టర్ రాజేశ్, డాక్టర్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రికులకు...



పాములపాడులో ఉచిత వైద్య శిబిరం

పాములపాడు, పిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీశైలం పాదయాత్ర వెళ్లే శివస్వాములకు ప్రభుత్వ వైద్యశాల వెలుపల ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆదివారం ప్రభుత్వ వైద్యశాల వైద్యుల పర్యవేక్షణలో ఏర్పాటు చేశారు. ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు ఈ ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు వైద్య సిబ్బంది తెలిపారు.

టీడీపీ నాయకుడి మృతి తీరని లోటు



అమీర్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

చాగలమర్రి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): టీడీపీ చాగలమర్రి గ్రామ కన్వీనర్ అమీర్ మృతి పార్టీకి తీరని లోటని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. టీడీపీ కన్వీనర్, ప్రముఖ క్రికెట్ క్రీడాకారుడు అమీర్ అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మృతుడి నివాసం వద్దకు చేరుకొని మృతదేహంపై పూలమాల వేసి సంతాపం ప్రకటించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర మైనార్టీసెల్ ఉపాధ్యక్షుడు అన్వర్‌బాషా, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తినరసింహులు, బీసీ సంఘం మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణగౌడ్, నాయకులు కొలిమి ఉసేన్‌వలి, మాబుషరీఫ్, అనిఫ్, జెట్టినాగరాజు, రామతీర్థం, గౌస్‌మోద్దీన్, టైలర్ అమీర్, రాజేంద్ర, గఫార్, క్రీడాకారులు పాల్గొన్నారు.

మండల స్థాయి క్యారమ్స్ పోటీలు ప్రారంభం



చాగలమర్రిలో క్యారమ్స్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

చాగలమర్రి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని దస్తగిరిస్వామి దర్గా వద్ద స్వర్ణకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండలస్థాయి క్యారమ్స్ పోటీలు ఆదివారం ఆ సంఘ అధ్యక్షుడు గౌస్‌బాష ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి గౌస్‌మోహిద్దీన్ మాట్లాడుతూ ఈ పోటీల్లో 16 జట్లు పాల్గొంటున్నాయని అన్నారు. పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు దాతలు దాదాపీర్, ఇంతియాజ్‌లు నగదు అందజేస్తారని అన్నారు. కార్యక్రమంలో డీలర్ ఆకుల ఇర్షాద్, సంఘ ఉపాధ్యక్షుడు గౌస్, అబ్దుల్లా, సర్ఫరాజ్, సహార అధ్యక్షుడు అబ్దుల్లా, గఫార్, క్రీడాకారులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

రుద్రవరం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : వరి ధాన్యం బస్తా రూ.3వేలకు కొనుగోలు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం రుద్రవరం మండలంలోని యల్లావత్తుల, చిన్నకంబలూరు, రుద్రవరం, నరసాపురం, ఆలమూరు, శ్రీరంగాపురం గ్రామాల్లో పర్యటించి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి రమేశ్‌కుమార్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రామచంద్రుడు మాట్లాడుతూ ఖరీఫ్ సీజనులో పండించిన వరి ధాన్యం 75 కేజీల బస్తా రూ.1300 నుంచి రూ.1500లోపే రైతులు అమ్ముకోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా కేంద్రాల్లో యూరియా కొరత లేకుండా చేసి రైతులను ఆదుకోవాలని అన్నారు. కార్యక్రమంలో శంకర్, బాల వెంకట్ పాల్గొన్నారు.

శివస్వాములకు అన్నదానం



శివస్వాములకు అన్నదానం చేస్తున్న నూర్ అహ్మద్

బేతంచెర్ల, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : సమాజంలోని అన్ని మతాలు, కులాలకు దేవుడు ఒక్కడే అని మత సామరస్య చైతన్య వేదిక అధ్యక్షుడు నూర్ అహ్మద్ అన్నారు. ఆదివారం దుర్గామల్లేశ్వర స్వామి దేవాలయంలో శివస్వాములకు ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నూర్ అహ్మద్ మాట్లాడుతూ సమాజంలో హిందూ, ముస్లీంలందరూ సమానులేనని కులాలు, మతాలు వేరైనా అందరికీ దేవుడు ఒక్కడే అని అన్నారు. ప్రతి ఏడాది శివస్వాములకు చైతన్య వేదిక ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో గౌస్, జయంత్ గౌడు, గురుస్వామి నారాయణస్వామి, శివస్వాములు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించండి



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న బాలనాగన్న

సంజామల, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): వసతి గృహాల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ సభ్యుడు బోధనం బాలనాగన్న సూచించారు. ఆదివారం సంజామల బీసీ బాలుర వసతి గృహాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల కోసం తయారు చేసిన వంటకాలను పరిశీలించారు. అనంతరం ఆయన స్వయంగా భోజనాలు వడ్డించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆయన మాట్లాడారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి కన్నవారి కలలను సాకారం చేయాలన్నారు. ఆయన వెంట కొరియర్ మద్దిలేటి, ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి వెంకటరాముడు, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

బెలుం గుహల్లో పర్యాటకుల సందడి

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బెలుం గుహల్లో పర్యాటకుల సందడి నెలకొంది. ఆదివారం ఇటు పాఠశాలలకు, అటు కార్యాలయాలకు సెలవు దినం కావడంతో పర్యాటకులు పెద్ద ఎత్తున బెలుం గుహలకు తరలివచ్చారు. దీంతో బెలుం గుహలకు ప్రవేశ రుసుం ద్వారా ఆదివారం ఒక్కరోజే రూ.49వేల ఆదాయం సమకూరినట్లు సిబ్బంది వెల్లడించారు.

పెద్దమ్మకు విశేష పూజలు

దొర్నిపాడు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మకు ఆదివారం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా పూజలు నిర్వహించారు. అమ్మవారికి భక్తులు పూజలు చేశారు.

స్నేహితుడికి ఆర్థిక సాయం

బనగానపల్లె, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): స్నేహితుడికి ఆర్థిక సాయం చేసి ఉదారతను తోటి మిత్రులు చాటుకున్నారు. మండలంలోని గుండ్ల శింగవరం ఉన్నతపాఠశాలలో 2006-2007 విద్యాసంవత్సరంలో చదువుకున్న విద్యార్థి అశోక్ పాముకాటుకు గురై అనారోగ్యం పాలయ్యాడు. దీంతో స్నేహితులు రూ.40వేలు ఆర్థిక సాయాన్ని ఆదివారం అందించారు. ఉపాధ్యాయులు రాంపుల్లారెడ్డి, రఘునాథ్, బాలమద్దిలేటి, సతీశ్‌కుమార్, రెడ్డి, రామచంద్రుడు, మధుభాస్కర్, మహేంద్ర తదితరులు ఆర్థిక సాయం అందించారు.

అడుగంటుతున్న భూగర్భ జలాలు

- కళ్లముందే వాడిపోతున్న పంటలు
- నెల రోజుల్లో వట్టిపోయిన 40బోర్లు
- తీవ్ర ఆందోళనలో అన్నదాతలు

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వైపరీత్యాలు అన్నదాతలకు కన్నీళ్లు మిగిలిస్తున్నాయి. భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి.. బోర్లు వట్టి పోతున్నాయి.. పచ్చని పంటలు కళ్ల ముందే వాడి పోతుండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది నెలకొన్న వర్షాభావ పరిస్థితుల కారణంగా కొలిమిగుండ్ల మండంలోని వివిధ గ్రామాల్లో రోజు రోజుకూ భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. దీంతో అన్నదాతల బోరు బావుల్లో నీరు ఇంకిపోయి ఎండిపోతున్నాయి. మండలంలోని మదనంతపురం, చింతలాయపల్లె, అబ్దులాపురం, కోరుమానుపల్లె తదితర గ్రామాల్లో రైతుల బోరు బావులు ఎండిపోతున్నాయి. దీంతో రైతులు సాగు చేసిన అరటి, బొప్పాయి, టమోట, వరి తదితర పంటలు వాడి పోతున్నాయి. ప్రధానంగా మదనంతపురం గ్రామం కొన్నేళ్లుగా ఉ ద్యానవన పంటల సాగుకు చిరునామాగా నిలిచింది. అయి తే వర్షాభావ పరిస్థితుల కారణంగా ప్రస్తుతం ఆగ్రామ రైతులు దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలో సుమారు 700ఎకరాల్లో ఉద్యానవన పంటలు సాగుచేయగా ఇందులో 400ఎకరా ల్లో అరటి సాగుచేశారు. అరటి గెలలు విస్తారంగా పండి, పంట తుది దశకు చేరుతున్న తరుణంలో బోర్లలో నీరు అ డుగంటడంతో అన్నదాతలు కన్నీరు మున్నీర వుతున్నారు. నెల రోజుల వ్య వధిలోనే ఒక్క మద నంతపు రం గ్రామం లోనే 40బోర్లు ఎండిపోయిన పరిస్థితి నెలకొనడం అన్నదాతలకు ఆందోళన కలిగిస్తోంది. అబ్దులాపురం, చింతలా యపల్లె, కోరుమానుపల్లె గ్రామాల్లో మరో 20మంది రైతుల బోర్లు వట్టిపోయాయి. దీంతో లక్షలాది రూపాయల విలువచేసే పంటల దిగుబడిని కాపాడుకోవడానికి అన్నదాతలు అప్పులు చేసి మరీ నూతన బోర్లు తవ్విస్తున్నారు. 500నుంచి వెయ్యి అడుగులు బోరు తవ్వినా నీరు పడని పరిస్థితి నెలకొంది. మదనంతపురం గ్రామానికి చెందిన కంబగిరిరాముడు అనే రైతు 10ఎకరాల్లో కోత దశకు చేరుకుంటున్న అరటి, బొప్పాయిని కాపాడుకోవడానికి వారం రోజుల వ్యవధిలో రూ.5లక్షలు వెచ్చించి, నాలుగు బోర్లు వేశాడు. అయినా చుక్క నీరు దొరకని పరిస్థితి నెలకొంది. మరి కొంత మంది రైతులు సైతం బోర్లు వేసి తీవ్రంగా నష్టపోతున్నారు. అరటి, టమోట, బొప్పాయి, వరి తదితర పంటలు సుమారు 100ఎకరాల్లో ప్రస్తుతం తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది.



ఎండిపోతున్న అరటి తోట



నీరులేక వదిలేసిన టమోట పంట

దిక్కు తోచడం లేదు



ఐదుఎకరాల్లో అరటి, ఐదు ఎకరాల్లో బొప్పాయి సాగుచేశాను. పంట చేతికి అందే సమయంలో బోర్లు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. పంటలను కాపాడుకోవడానికి రూ. ఐదులక్షలు పెట్టి వారం రోజుల వ్యవధిలో నాలుగు బోర్లు వేయించా. నీరు మాత్రం పడలేదు. రూ.20 లక్షలకు పైగా నష్టం వచ్చింది. ఏమి చేయాలో దిక్కుతోచడం లేదు.

- కంభగిరి రాముడు, రైతు

పంటలను వదిలేశాను



బోరు బావి ఆధారంగా రెండు ఎకరాల్లో టమోటా సాగు చేశాను. అయితే భూగర్భ జలాలు అడుగంటి బోరు ఎండిపోయింది. దీంతో పంటను వదిలివేశాను. సుమారు రూ.2లక్షలు నష్టవాటిల్లింది.

- అంబటి మల్లారెడ్డి, టమోటా రైతు

రెండు బోర్లు వేయించా



మూడు ఎకరాల్లో అరటి సాగు చేశాను. బోరు ఎండి పోవడంతో రూ.2లక్షలు వెచ్చించి మరో రెండు బోర్లు వేశాను. ఒక్క బోరులో కొంతమేర నీరు పడింది. అది ఎంతకాలం వస్తుందో అర్థం కావడంలేదు.

- వెంకటరాముడు,

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి: ఎమ్మెల్యే కోట్ల

ప్యాపిలి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని ఊటకొండ గ్రామంలో ఆయన చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా కోట్ల మాట్లాడుతూ హంద్రీనీవా సుజల స్రవంతి పథకం ద్వారా నియోజకవర్గంలోని చెరువులకు త్వరలో నీరు అందిస్తామన్నారు. దీనివల్ల సాగునీటితో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని తెలిపారు. ఇందుకు సంబంధించిన పనులు కూడా వేగవంతంగా సాగు తున్నాయన్నారు. అలాగే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను దశలవారిగా అమలు చేయడానికి సీఎం చంద్రబాబు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని తెలిపారు. సమావేశంలో నాయకుల ఖాజాపీర్, మెట్టుపల్లి సుదర్శన్, పాపయ్య, ప్రతాప్ పాల్గొన్నారు.



ఊటకొండ గ్రామంలో రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోట్ల

పార్వేట ఉత్సవమూర్తులకు పులికాపు

● పట్టువస్త్రాలను అందించిన నిర్మల శేషఫణి దంపతులు

రుద్రవరం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలో చందలూరు గ్రామంలో ఆదివారం పార్వేట ఉత్సవమూర్తులైన జ్వాలా లక్ష్మీ నరసింహ స్వామి, ప్రహ్లాద వరదస్వామికి పులికాపు నిర్వహించారు. అర్చకులు సంతానం, నందుల ఆధ్వర్యంలో పులికాపంలో భాగంగా ఉత్సవ మూర్తులైన లక్ష్మీనరసింహస్వామి, ప్రహ్లాదవరదస్వాములకు అభిషేకం చేసి పట్టువస్త్రాలతో అలంకరించారు. ఉత్సవ పల్లకీలో భాగంగా ఉయ్యాలవాడ మండలం సర్వాయపల్లె గ్రామంలో కోనేరు ఒడ్డున అభిషేకం నిర్వహించి నూతన పట్టవస్త్రాలతో ఉత్సవమూర్తులను అలంకరించారు. పార్వేటలో సర్వాయిపల్లె, చందలూరు, టి.లింగందిన్నె గ్రామాల్లో ఉత్సవమూర్తులకు నూతన పట్టువస్త్రాలతో అలంకరిస్తామని తెలిపారు. పూర్వీకుల నుంచి వస్తున్న ఆనవాయితీని కొనసాగిస్తున్నామని ఆకుమల్ల నిర్మల - శేషఫణి దంపతులు అన్నారు. ప్రతి ఏడాది పార్వేట ఉత్సవంలో భాగంగా ఉత్సవమూర్తులకు ఈ పట్టువస్త్రాలు అందించడం కుటుంబానికి ఆనవాయితీగా వస్తుందన్నారు. ఉత్సవమూర్తులకు పట్టువస్త్రాలు అందించి పూజలు చేయడంతో పుణ్యఫలాలు సిద్ధిస్తాయని వారు తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం

చాగలమర్రి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ధ్యానంతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని శివరామానంద ఆశ్రమ పీఠాధిపతి అభినవ శంకరానందస్వామి తెలిపారు. ఆదివారం చాగలమర్రి పాత శివాలయంలో ఆదిశంకర రచించిన ప్రవచనాలపై భక్తులకు అవగాహన కల్పించారు. ప్రవచన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి హిందూవు ఆధ్యాత్మిక చింతన కలిగి దైవమార్గంలో నడవాలని సూచించారు. హిందూవుల పవిత్ర గ్రంధమైన భగవద్గీతను చదవాలని, గోవిందనామ పఠనం చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, కమిటీ సభ్యులు, శివస్వాములు, మహిళలు పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు

రుద్రవరం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రుద్రవరం, కొండమాయపల్లె, చిన్నకంబలూరు గ్రామాల్లో ఆదివారం గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. పెద్దమ్మ, మారెమ్మ, సుంకులమ్మ అమ్మవార్లకు బోనాలు, చీరలు సమర్పించి పూజలు చేశారు. అలాగే ముత్తలూరు గ్రామ సమీపంలో కొలువుదీరిన లింగమయ్యస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి వారికి నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు

బేతంచెర్ల, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ఘర్షణలకు పాల్పడుతూ ప్రజాజీవనానికి ప్రజాశాంతికి భంగం కలిగిస్తే శాఖాపరమైన కఠిన చర్యలు తప్పవని సీఐ వెంకటేశ్వరరావు హెచ్చరించారు. ఆదివారం బేతంచెర్ల పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ సీఐ ఇచ్చారు. కౌన్సిలింగ్‌లో ఎస్ఐ రమేష్‌బాబు పోలీసు సిబ్బంది ఆయా గ్రామాల రౌడీషీటర్లు పాల్గొన్నారు.

శిరివెళ్లలో కార్డెన్ సెర్చ్

శిరివెళ్ల, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి) : శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ చిన్న పీరయ్య హెచ్చరించారు. శిరివెళ్లలోని ఎస్సీ కాలనీలో ఆదివారం తెల్లవారుజామున కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానితుల ఇళ్లలో సోదాలు నిర్వహించారు. కాలనీలో రోడ్ మార్చ్ నిర్వహించిన అనంతరం స్థానికులతో ఎస్ఐ మాట్లాడుతూ ప్రజలు గొడవలకు దూరంగా ఉండాలన్నారు. ఏదైనా సమస్యలుంటే సంబంధితశాఖ అధికారుల, పోలీసుల దృష్టికి తీసుకువస్తే తగిన విధంగా పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో రుద్రవరం ఎస్ఐ వర ప్రసాద్, పోలీసు, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు నమోదు చేసుకోవాలి

డోన్ టౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పాస్‌బుక్ ఉన్న రైతులందరూ రైతు సేవా కేంద్రాల్లో గుర్తింపు సంఖ్య నమోదు చేసుకుని గ్రామ సర్పంచ్ కళ్యాణి సూచించారు. ఆదివారం మండలంలోని కనపకుంట గ్రామంలో డప్పు దండోరా వేయిస్తూ రైతులకు తెలియజేసేలా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులందరూ ఆయా రైతు సేవా కేంద్రాల్లో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

మద్యం తాగి వాహనం నడపరాదు

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగి వాహనం నడపరాదని సీఐ హనుమంతనాయక్ తెలిపారు. ఆదివారం కోవెలకుంట్ల పట్టణంలోని జమ్మలమడుగు సర్కిల్ వద్ద వాహనాలు తనిఖీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు. అనంతరం సీఐ హనుమంతునాయక్ మాట్లాడుతూ డ్రైవర్లు తప్పనిసరిగా లైసెన్సు కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ మల్లిఖార్జునరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో అన్నదానం



రోగులకు అన్నదానం చేస్తున్న జానీ ప్రభాకర్

డోన్ టౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గుత్తి రోడ్డులో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నదానం చేసినట్లు ప్రార్థన సమయం మినిస్ట్రీ నిర్వాహకుడు పాస్టర్ జానీ ప్రభాకర్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ డోన్ పట్టణంలోని వైఎస్ నగర్‌కు చెందిన పాల వ్యాపారి విద్యాసాగర్ ఆర్థిక చేయూతతో రోగులకు, బాలింతలకు రొట్టెపప్పు, గుడ్డు అందించామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

రుద్రవరం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నక్కలదిన్నె గ్రామసమీపంలో ఆదివారం మోటారు సైకిల్, కారు ఢీకొన్న సంఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. కడప జిల్లా వేంపల్లెకు చెందిన గోవర్ధన్, చాగలమర్రికి చెందిన కుళ్లాయప్ప తీవ్రంగా గాయపడ్డారు. 108 వాహనంలో చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

బెల్ట్ షాపు నిర్వాహకుడి అరెస్ట్

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బందార్లపల్లె గ్రామంలో అక్రమంగా బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సీఐ రమేష్‌బాబు ఆదివారం తెలిపారు. గ్రామానికి చెందిన వెంకటశివ గ్రామ సమీపంలోని గంగమ్మ గుడి వద్ద మద్యం బాటిళ్లు విక్రయిస్తుండగా 16బెంగుళూరు క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకొని, అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి

- పశువైద్యాధికారి రమేష్‌బాబు



కొలిమిగుండ్ల ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : పాడి రైతుల కోసం ప్రభుత్వం అందిస్తున్న పశుగ్రాసం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ రమేష్‌బాబు సూచించారు. ఆదివారం 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడారు.

ప్రశ్న: పశుగ్రాసం పథకానికి ప్రభుత్వ ప్రోత్సాహం ఎలా ఉంది..?

జవాబు: పాడి రైతులకు పశుగ్రాసం కోసం ఏడాదికి ఒక ఎకరాకు రూ.33వేలు ప్రభుత్వం అందిస్తోంది. ఇప్పటి వరకు 20మంది రైతులు ఈ పథకం కోసం దరఖాస్తు చేసుకున్నారు.

ప్రశ్న: మండలానికి మినీ గోకులం షెడ్లు ఎన్ని మంజూరయ్యాయి..? అవి ఏస్థాయిల్లో ఉన్నాయి.

జవాబు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఉపాధి హామీ పథకం కింద గోకులం షెడ్లు నిర్మిస్తున్నారు. మండలానికి 21 గోకులం షెడ్లు మంజూరు కాగా, ఇప్పటికే 12 నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగిలినవి కూడా త్వరలోనే పూర్తి చేసుకోవాలని రైతులకు సూచించాం.

ప్రశ్న: మండలంలో ఎన్ని పశువులు ఉన్నాయి..? గొర్రెలు, మేకల సంఖ్య ఎంత..?

జవాబు: గత లెక్కల ప్రకారం మండలంలో ఆవులు, గేదెలు 10వేల వరకు ఉన్నాయి. ఇక గొర్రెలు, మేకలు కలుపుకొని 90వేలు ఉన్నాయి.

ప్రశ్న: మండలంలో పశు గణన ఎలా జరుగుతోంది..?

జవాబు: మండలంలో పశుగణన చురుగ్గా జరుగుతోంది. ఎన్యూమరేటర్లు ఇంటింటికీ తిరిగి పశుగణన చేపడుతున్నారు. ఇప్పటికే 50శాతం వరకు పూర్తిచేశాం. త్వరలోనే పశుగణన కార్యక్రమం పూర్తవుతుంది.

ప్రశ్న: మందులు, సిబ్బంది కొరత ఏలా ఉంది..?

జవాబు: పశువైద్యశాలలో మందుల కొరత లేదు. కానీ సిబ్బంది లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొలిమిగుండ్ల పశువైద్యశాలలో ఒక్క డాక్టరు తప్ప కింది స్థాయి సిబ్బంది పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి.

జాతీయస్థాయిలో విద్యార్థిని ప్రతిభ



విద్యార్థి మదిహా

చాగలమర్రి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నవంగలి గ్రామానికి చెందిన విద్యార్థిని మదిహా ఈనెల 13, 14 తేదీల్లో నాసిక్‌లో జరిగిన జాతీయస్థాయి జంప్‌రోప్ అండర్-14 విభాగంలో ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించింది. చిన్నవంగలి గ్రామానికి చెందిన మహబూబ్‌బాష, నూర్జాహన్ దంపతుల కుమార్తె మదిహా నంద్యాలలోని ఓ పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. జాతీయస్థాయికి ఎంపికైన విద్యార్థిని మదిహాను గ్రామ సర్పంచ్ మౌళిబాష, టీడీపీ నాయకులు నరేంద్రారెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, సంజీవరెడ్డి, నర్సిరెడ్డి, క్రీడాకారులు అభినందించారు.

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా: సీఐ



సోదాలు నిర్వహిస్తున్న పోలీసులు

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు తెలిపారు. ఆదివారం మండలంలో అతి సమస్యాత్మక గొర్విమానుపల్లె గ్రామంలో సీఐ రమేష్‌బాబు ఆధ్వర్యంలో సోదాలు నిర్వహించారు. వీధుల్లో పోలీసు బలగాలతో ప్రదర్శన చేశారు. ఆయా పార్టీల నాయకుల ఇళ్లతో పాటు, గ్రామ పరిసరాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ప్రజలు గొడవలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ గోవింద నాయక్, పోలీసులు పాల్గొన్నారు.

గంగ జాతర ప్రారంభం

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొర్వి మానుపల్లె గ్రామంలో గంగ జాతర వేడుకలు ఆదివారం ప్రారంభమయ్యాయి. గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ప్రతి ఏడాది సాంప్రదాయ పద్ధతిలో గంగజాతర వేడుకలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. గంగ వేషధారణతో గ్రామ సమీపంలోని గుడి వద్దకు చేరుకొని వేడుకలు నిర్వహించారు. రెండు రోజుల పాటు గంగ జాతర వేడుకలు జరుగుతాయని తెలిపారు.

విద్యలో రాణించాలి

డోన్ రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మదరసా పాఠశాలలో చదువుకునే విద్యార్థులు చదువులో బాగా రాణించాలని ఆల్ మైనార్టీ ఎంప్లాయిస్ నేషనల్ చైర్మన్ సయ్యద్ హుశేన్ అన్నారు. ఆదివారం పట్టణంలోని శ్రీరామ్‌నగర్‌లో మదరసా మొహిద్దీన్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మదరసా పాఠశాల రెండో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేడుకలకు 300 మందికి పైగా విద్యార్థుల తల్లిదండ్రులు హాజరయ్యారు. డోన్ పట్టణంలోని 14 మసీదుల ఇమామ్‌లు, మొహజాన్ పాల్గొని తమ ఆత్మీయ ప్రసంగాలు వినిపించారు. కార్యక్రమంలో హైదరాబాదు నుంచి ఉర్దూ యూనివర్సిటీ ఫ్యాకల్టీ మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్, డా.ఎండీ అబ్దుల్ రబీద్ సాహేబ్ పాల్గొన్నారు.

'వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి'

డోన్ రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని డోన్ వాల్మీకి సంఘం నాయకులు, సీనియర్ న్యాయవాది సీలం భాస్కర్ నాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం కర్నూలులో ఓ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన వాల్మీకి న్యాయవాదుల ఆత్మీయ సమావేశానికి డోన్ నుంచి సీలం భాస్కర్ నాయుడు ఆధ్వర్యంలో వాల్మీకి న్యాయవాదులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా సీలం భాస్కర్ నాయుడు మాట్లాడుతూ వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించేంత వరకు తమ పోరాటాలు కొనసాగిస్తామన్నారు.

విద్యారంగం నిర్వీర్యం: ఎస్టీయూ

చాగలమర్రి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వం విద్యారంగాన్ని ప్రయోగశాలగా మార్చి నిర్వీర్యం చేస్తున్నారని ఎస్టీయూ మండల అధ్యక్షుడు మస్తాన్‌బాష, కార్యదర్శి సుబ్బారావు, ఆర్థిక కార్యదర్శి మాబుహుసేన్ అన్నారు. ఆదివారం చాగలమర్రి ఎస్టీయూ కార్యాలయంలో వారు మాట్లాడుతూ అనేక రకాలైన సమాచారం పంపడం పేరుతో మానసిక ఆందోళనకు గురి చేస్తున్నారని అన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేయడం సరికాదన్నారు. సమావేశంలో ఎస్టీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి శివశంకర్, ఉపాధ్యక్షుడు మహబూబ్‌బాష ఉన్నారు.

నాయకులు బరితెగించారు: సీపీఎం

డోన్ రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): సంపాదనే లక్ష్యంగా కొందరు చోటా నేతలు బెల్టు షాపుల ఏర్పాటుకు ప్రోత్సాహిస్తూ ప్రజా సేవను విస్మరించి బరి తెగిస్తున్నారని సీపీఎం పట్టణ, మండల కార్యదర్శులు కోయలకొండ నాగరాజు, నక్కి శ్రీకాంత్ అన్నారు. ఆదివారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. డోన్‌లో చోటా నాయకులు బెల్టు షాపుల ఏర్పాటుకు రూ.20వేల నుంచి రూ.40వేల దాకా వసూలు చేస్తూ అక్రమార్జనకు తెరలేపారని ఆరోపించారు. బెల్టు షాపులను సంబంధిత అధికారులు నియంత్రించకపోతే మహిళలతో కలిసి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.